# పూలబాసలు

"మల్లేపూల్" మల్లేపూల్"

పూలరాముడి కేక వీధంతా మారుమ్రోగింది. అతని ఖాతా ఇళ్ళల్లో ఆడవాళ్ళు బయటికివచ్చి రాముడు దగ్గర పూలు చకచకా కొనేసుకుపోతున్నారు. మల్లెపూల రాముడు కనుచీకటి పడకుండానే గంపలోని పూలన్నీ ఖాళీ చేసుకొని గలగలలాడే జేబుతో తనగుడిసె చేరుకుంటాడు. రాముడికి తల్లి లేదు, తండ్రీ లేడు. తోబుట్టువులు అసలే లేరు. ఎప్పుడో చిన్నతనంలో వచ్చి అప్పటినుండీ అక్కడే ఉండిపోయాడు. ఇరవై ఏళ్ళు పైబడిన రాముడి మనసు ఈ రోజు మల్లెపూల పరిమళం నింపుకొని రెక్కలు విప్పుకున్న తెల్లపావురంగా ఎగిరిపోతోంది. అతడి మనసునిండా "రంగి" పేరు మారుమ్రోగిపోతోంది. అతను పెళ్ళి చేసుకుందామని డబ్బు జాగ్రత్తగా కూడబెడుతున్నాడు. ఆ డబ్బు ఈ రోజు ఎక్కువగా ప్రోగుపడి అతని హృదయంలో కోరికల పొంగులా గలగలమని అలజడి చేస్తోంది. అతను గుడిసె తలుపు తీసి

బయటికి వచ్చాడు. అతనికి నాది అని ఉన్నది ఒకే ఒక యాభై గజాల మల్లెతోట. దాని మధ్య చిన్న పూరిపాక కాని యిప్పుడు అందాలు చిందే చక్కని చుక్క కూడ తనది కాబోతోందని తలచుకున్నప్పుడు అతని వొళ్ళు పులకించి పోతోంది. అతడు తోటదగ్గర తడిక కిర్రుమంటే అటు చూశాడు. నిజంగా వనలక్ష్మిలా నిలబడిన "రంగి"ని చూసి ఒక్క అంగలో గేటు చేరాడు.

"మావా" అంది మెల్లగా రంగి.

"ఏవే రంగీ" ఇప్పుడొచ్చావు అన్నాడు కాస్త ధైర్యంగా!

"రంగి"కి ఒక్కసారి కోపం వచ్చింది. చర్రున ముఖం పక్కకు తిప్పుకుంది.

అవునులే నీకేం? నీవిక్కడ హాయిగా కూకుంటే నాగతి ఏమైనట్టు?

"అదేంటి? ఇప్పుడేమైంది?"

"నువ్వు నన్ను మనువాడతానని మా అన్నకి సెప్ప లేదే?" సూటిగా వుంది ఆమె ప్రశ్న. రాముడు తడబడ్డాడు.

అవునూ సెప్తాను - రేపువచ్చి.

రేపూ, మాపూ అంటావుండు. ఆడ మా అన్న ఇంకే వరికో మాట ఇచ్చేస్తాడు.

"అదేంటి ? అయితే నేనిప్పుడే వస్తానుండు"

రంగి "నిజంగానా - రా మావా" మా అన్న ఎవర్నో తీసుకొచ్చి నన్ను సూపించాడు. ఆడు ఎవడో కారు షెడ్డులో పనట, నాకు వద్దు. నాకీ మల్లెతోట - ఈ పూలు - ఈ చెట్లూ - ఇంకా ఏదో అనబోయి ఆగిపోయింది.

"రాముడి మనసు పులకరించింది.

"రంగి" చెంగున బయటికి గెంతి చీకట్లో మాయమైంది.

చిన్న పందిరిలో సినిమా రికార్డుల మోతలో రాముడి పెళ్ళి హడావిడి మిన్ను ముట్టుతోంది.

"పూలు గుసగుసలాడేననీ-ఈ రోజే తెలిసిందీ" నిజమో మరి రాముడికి ఈ రోజే తెలిసింది రహస్యం -

రాముడి తోటలో మల్లెపూలన్నీ కోసి మాలలు కడుతున్నారు. "రంగి" మనసు పరవశంతో పరవళ్ళు తొక్కుతోంది. నిజానికి "రంగి" అంత పంతంపట్టి రాముణ్ని పెళ్ళాడిందీ అంటే దానికి మూడు వంతులు అతని మల్లెతోటే కారణం. చిన్ననాటి నుండీ రంగికి మల్లెపూలు అంటే మహా ఇష్టం. ఎన్నిపూలు తలనిండా తురుముకున్నా ఇంకా తీరని ఆశ అలా నిలిచిపోయింది. ఎప్పుడైనా అన్న పది పైసలు పూవులకోసం ఇస్తే, పది పైసలపూలు రంగికి చాలా నిరుత్సాహాన్ని కలిగించేవి, ఆమె ఆశకి తగిన పూలగంప ఈ నాడు తన ఇంటి లోనే ఉందని ఆమె మురిసిపోయింది.

అంతా హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు. బయట సైకిల్ బెల్ మోగింది. ఆ హడావిడిలోంచి ఎవరో అడిగారు : ఆ సైకిల్ మీద మనిషిని చూసి - ఏం కావా లండీ ?

ఇంతలో అక్కడే చెక్కబల్లమీద కూర్చొని కబు ర్లాడుతున్న రాముడు తటాలున లేచి ఏం బాబుగారు యిలా వచ్చారు ? అన్నాడు.

"ఈ వేళ మా అక్క పెళ్ళికదూ - నాన్నగారు నిన్ను రెండు మల్లెదండలు పెద్దవి బాగా కట్టి తీసుకొని రమ్మన్నారు- అన్నాడు.

రాముడు ఒక్కక్షణం మాట్లాడలేదు.

"అదేటి బాబు యీ యేల రాముడికూడా పెళ్ళే. మా యింట్లో పూలు లేకుంటే మీ కెలా యిస్తాం? అన్నాడు ఓ పెళ్ళి పెద్ద.

నువ్వుండు సిన్ననాన్న నేను ఆరింటికాడ పదేళ్ళనుండి పూలిస్తున్నా - ఈయాల లతమ్మగారి పెళ్ళా - సర్లెండి నే పంపుతా అంటూ లోపలికొచ్చాడు.

చెలువల్లాంటి రెండు మల్లెదండలు అప్పుడే కట్టడం పూర్తిచేసి అక్కడ పెట్టారు. ఎర్రని రత్నాలు పొదిగినట్లు మధ్యలో గులాబీలు పొదిగి వున్నాయి. అవి రెండు చేతి మీద వేసుకొని అక్కడే వున్న మల్లయ్యని పిలిచి అవి జమీందారు "రావుగారి" యింటికి పంపేశాడు రాముడు.

దండలు కట్టగా మిగిలిన రెండు దోసిళ్ళ మల్లెపూలు చేతిలోకి తీసుకొని మంచంమీద చల్లాడు రాముడు.

ఆ రాత్రి రంగి చాలా నిష్ఠురంగా మాట్లాడింది. తన కంటే వాళ్ళే ఎక్కువా అని అడిగింది. అసలు ఎవరిని అడిగి యిచ్చావు పూలు అంది. అన్నిటికీ రాముడు మల్లెలాంటి చిరునవ్వు నవ్వాడు. కోపగించుకొంది రంగి.

ఆమెను దగ్గరకి లాక్కున్నాడు రాముడు. అతని దగ్గర చేరి మల్లెలకోసం తగాదా మర్చిపోయింది. అతని వెచ్చని హృదయంలో మల్లెల ఘుమఘుమలు చవిచూసింది. అతని స్పర్శలో మల్లెల మెత్తదనం మనసారా అనుభవించింది.

రంగి పెళ్ళయి పదిరోజులు పైగా గడచిపోయింది. ఆమె మనసులో చిన్న అసంతృప్తి చోటు చేసుకొంది. తనేదైతే ఆశించి ఇక్కడికి వచ్చిందో అది పూర్తిగా తనకు లభించలేదనిపించింది. తను ఆశించే పూలు, తను కోరుకునే పూలు అతనుఇవ్వడు. రోజూ ఒక దోసెడు-రెండు దోసెళ్ళు-మరీ కాదంటే మూడు దోసెళ్ళు యిస్తాడు.

మరింకేమైనా అంటే !

„ఏంటే రంగీ పిచ్చి - అన్ని పూలు నీవే సింగారిస్తే కూడొద్దా ? మనకి" అంటాడు.

నిజానికి రంగికి అన్నం వద్దనే అనిపిస్తుంది. కాని ఆ మాట నోట పెగలిరాదు ఆమె మనసు అవమానంతో చివుక్కుమంది. ముఖం కోపంతో ఎర్రబడుతుంది ఆ కోపాన్ని ఆ క్షణంలో పోగొట్టగల శక్తి రాముడి దగ్గర వుంది. అందుకే తను అసంతృప్తిని శాశ్వతంగా మనసులో పెట్టుకోలేక పోతోంది. చల్లని అతని చూపులో, నిర్మలమైన అతని ప్రేమలో ఆమె కరగిపోతుంది - అన్నీ మర్చిపోతుంది.

"రాముడు" తోటలో మల్లెపూల సంరక్షణ అంతా "రంగి" మీద వేశాడు. సన్నని చిరుజల్లులో ఇద్దరూ కలిసి మొక్కలకు కుదుళ్ళుచేసి, ఆకులు దూసి ఆ పొదల చాటుల్లో వాటినీడలో ఎక్కువ సమయం గడిపేవారు.

జాతరకెళ్ళాలని రంగి ముస్తాబు త్వరగా పూర్తిచేసింది. అందమైన కళ్ళకు కాటుకపెట్టి, నున్నని బుగ్గలకు మరింత పౌడరు అద్ది, ఎర్రని తిలకం అందంగా తీర్చుకొని పెళ్ళినాడు కొనుక్కున్న జరీ అంచు ఎర్రచీర కట్టుకొని కాళ్ళకి మువ్వలు, వాటికింద కడియాలు అన్నీ జాగ్రత్తగా అమర్చుకొని పూల దండ తలలో పెట్టబోతూ ఒకసారి వెనక్కి తిరిగి

"మావా ఇంతేనా ఇంకాసిని పూలియ్యవూ అంది గారంగా !

"చాల్లేవే, ఇప్పటికే గంగానమ్మలా తయారయ్యావే" అని గేలి చేశాడు రాముడు.

ఆమె మూరెడు ముడుచుకొని పూలు తల్లో పెట్టుకొన్నది. ఆమె మనసులో అసంతృప్తిగానే ఉంది. ఇంత చిన్న దండ ఎలా పెట్టుకోనూ అని వుంది. కానీ ఏం చేస్తుంది !

తీర్థంలోకి బయలుదేరింది రంగి, ఒకటే జనం. ఎక్కడ చూస్తే అక్కడ జనం. "రంగి" ప్రతి ఆడదాని తల్లోపూలు చూస్తోంది అందరి తల్లోపూలు తనకంటే ఎక్కువగానే అని పించసాగాయి. అలాంటి ఊహ రాగానే రంగి మనసు చిన్న బోయింది. ఉత్సాహం సన్నగిల్లింది. అన్నీ చూస్తోంది. మనసు ఎటో పరుగెడుతోంది. "ఒసీ రంగీ" వెనుకపాటుగా వచ్చి వాటేసుకోపోయింది నాగులు.

"నాగులూ నువ్వా! ఎప్పుడొచ్చావు ? అంది.

"నిన్న రాతిరి" - ఆ బాగున్నావా ! ఎన్నాళ్ళయిందే నిన్ను నూసి అంటూ నడుంచుట్టూ చేతులు పోనిచ్చింది నాగులు.

"ఆ బాగానే - నీవెట్టా వున్నావు ? అంది రంగి. చిన్న నాటి స్నేహితురాలు ఎన్నాళ్ళకి కనిపించిందన్న ఆనందం ఆమె ముఖంలో స్పష్టంగా కనుపించింది.

"ఇదిగో" మా పిల్లోడు అంటూ చంకలో పిల్లాణ్ని చూపింది నాగులు.

రంగి ముద్దుగా పిల్లాడి బుగ్గలు చిదిమింది.

ఇద్దరూ నడుస్తూ ఏవో కబుర్లాడుకుంటున్నారు. చిన్న నాటి ఆటలు పాటలు వాదులాటలూ అన్నీ వాళ్ళమధ్య గలగలపారే సెలయేటిలో అలల్లా కదలిపోతున్నాయి.

రంగి కళ్ళు నల్లత్రాచులాంటి పొడుగాటి నాగులు జడమీద ఆ జడని సగం కప్పేసిన తెల్లని మల్లెపూల చెండు మీద నిలిచిపోయాయి. నాగులు గలగలమని నవ్వుతుంటే మల్లెపూలు నవ్వినట్లనిపించింది. రంగికి నాగులు జడలో దండముందు తన జడలో దండ ఎంతో పీలవంగా ట్యూబు లైట్ ముందు కొవ్వొత్తిలా అనిపించింది. ఏ కాగు పెద్దులో పనిచేసేవాడు తనకొద్దు అని చెప్పిందో అతన్నే పెళ్ళాడింది నాగులు రంగి పదే పదే తన జడకేసి చూడటం నాగులు గమనించింది.

“ఏటే ? నా పూలు సూస్తున్నావా ? బాగున్నాయి కదూ ! మా ఆయన్ని అడిగి ఈ వేళ రెండురూపాయల పూలు కొనుక్కున్నా ! అయినా రోజూ కొనుక్కుంటానేంటీ ఏదో జాతరకదా అని - మరి నువ్వేంటి అంత తక్కువపూలు పెట్టుకున్నావు ?

రంగి కళ్ళల్లో నీళ్ళుకదిలాయి. మాట పెగల్లేదు. ఏదో చెప్పబోయింది.

అవున్లే మీదే మల్లెతోట విసుగ్గా అనిపించివుంటుంది. నీకు కదూ - అవును రోజూ చూస్తూ బోలెడు పెట్టుకుంటూ వుంటావుగా నీకేంటి పూలతోటే నీదాయే - నాగులు ఇంకా

మాట్లాడుతోంది - రంగి ఏమీ చెప్పలేదు. నాగులు వాళ్ళ యన కనిపిస్తే అలు వెళ్ళిపోయింది.

ఆరోజు రాత్రి రంగి వెక్కి వెక్కి ఏడ్చింది. రాముడు ఎంత బ్రతిమాలినా విషయం చెప్పలేదు. రాముడు ఎంతో సేపు బుజ్జగిస్తే "నా కంత తక్కువ మల్లెపూలు యిచ్చావే" అన్నది. ఏమనాలో ఎలా అనాలో తెలియక ఆ మాటవిని రాముడు అరగంటసేపు కడుపుబ్బేలా నవ్వాడు.

"ఓసీ ఇదా రేపు నీ ఇష్టం ఎన్నయినా పెట్టుకో" అన్నాడు అంతకీ కోపం పోకపోతే "రంగి"ని కవ్వించి పకపకా నవ్వించాడు. ఆరోజు రాముడు చకచకా భోజనం చేస్తూ చెప్పాడు రంగితో.

"ఇదిగో నేను పట్నం వెళుతున్నాను. అక్కడ పెద్ద పూలకొట్టు వుంది వాళ్ళకి మలెపూలు ఖాతాగా పంపాలట మనకి మంచి లాభంలే. ఈ సాయంత్రానికి అక్కడికి చేరుతా! రాత్రి పని అవకపోతే తెల్లారేసరికి వస్తా అంటూ చేయి కడుక్కున్నాడు.

"సూరిగాడు పూలు కోసుకెళ్తాడు యీ వేళకి" అని చెప్పి చేతి సంచితో చకచకా అడుగులు వేశాడు రాముడు

సూరిగాడు బుట్టతీసుకున్న అలికిడి విని తొంగి తొంగి చూసింది. అతను పూలు కోయడం మొదలుపెట్టాడు.

"ఇదిగో సూరన్నా నాకు చాల మొగ్గలు కావాలి! చాల అంటే ఒక శేరు వుంచి మిగిలిన మొగ్గ తీసుకువెళ్లు" అంది.

సూరన్న ఇటు తిరిగి రంగిని చూశాడు. ఎందుకో ఫకాల్న నవ్వి, అలాగే అన్నాడు.

సూరిగాడు ఎందుకు నవ్వాడు ? తనకి పూలంటే పిచ్చని నవ్వాడా ? లేకపోతే లేకపోతే - మామ లేకుండా తనకి పూలెందుకని - ఆ పైన ఇంక ఆలోచించలేకపోయింది. ఆమె హృదయం విలవిలాడింది. తనకీరాత్రి పూలెందుకూ అని పించింది. నిజంగా మామ లేకుండా తనకీ పూలు ఎందుకు నిజం పూలెందుకు ? ఆమె ఆలోచనలు చరచరా పాముల్లా బుర్ర నిండా ప్రాకుతున్నాయి. సూరన్న పూలు దండగా కట్టి పిల్చి అక్కడే పెట్టి వెళ్ళిపోయాడు. ఆమె ఆ దండ కనీసం తాకనైనాలేదు. ముక్కాలి పీటమీద పూదండ అలాగే వుండి పోయింది. రాత్రి అయినకొద్దీ మొగ్గల రేకులన్నీ విచ్చుకొని పీటంతా పరచుకొని పడుకున్నట్లు వున్నాయి. కళ్ళప్పగించి చూస్తూ రంగి ఆ రాత్రి గడిపేసింది.

తెల్లారిపోయింది. సూర్యుడు ఛర్రున పైకిలేచాడు. తోట గేటు తెరచుకొని రాముడు రావటం చూసి పూర్తిగా వాడని మల్లెదండను ఏటికి నీళ్ళకోసం వెళ్ళే బిందెలో పెట్టి రాముడికి ఎదురువెళ్ళింది రంగి.

అతనికి మంచినీళ్ళిచ్చి, అతను విశ్రాంతిగా కూర్చొ గానే బిందె చంకన పెట్టుకొని ఏటికేసి బయలుదేరింది దండ ఏటిలో వదలి బిందెలో నీళ్ళు తేవడానికి.

( "తారక" పత్రిక నుండి)